# మగని చెవిలో

"అనసూయ"

(పోరుగామెను గురించి)

ఏమండీ! మన యువతల పోరుగు వెల్నాటం ఓవర్శీరూ అతని పెళ్లాం ఎందుకండీ అలాగు దెబ్బలాడుకుంటూరు? అతడి పెళ్లాం చర్యలు చూస్తే నన్ను నిజంగా శాంతమూర్తినిగా మీరు అనకతప్పదు! నువ్వంటే నువ్వని దెబ్బలాడుతుందండీ! మొగుడు మన్నాపన ఏమీలేదు; తిట్టుకు తిట్టు తిడుతుంది, మాటకు మాట అంటుంది. ఇంకా చుట్టుప్రక్కల యిళ్లున్నవి గాని లేకపోతే కొడుతుందేమోకూడాను! అక్కడికీ అతడు సముదాయిస్తూనే ఉంటాడు! కాని అది ఊరుకోదండి! ఏదో చేసేడనో చెయ్యలేదనో యెత్తుకుంటుందండీ ధోరణి! అది పట్టుకొని జణాయించి జణాయించి చూశారూ! తుపానులో గాలీ వానా లెంపలు వాయించినట్లు అడా పెడా కొడతాయి—అలాగు అతడిమీద కురిపించేసరికి అతడు కొంతసేపు సమాధానాలు చెప్పి చెప్పి ఆఖరుకి చాలలేక నెత్తి మొత్తుకున్నా వదలదండీ! ప్రతీరోజూ వాళ్లిద్దరికీ యేదో దానికి యుద్ధమే గదా! చూడగా చూడగా వాళ్లది మార్జాల దాంపత్యములాగు కనబడుతుంది నాకు!

'మనది మాత్రమో!'

చాలు! సంతోషమైంది! కడుపు నిండిపోయింది! ఇన్నాళ్లూ చేసిన చాకిరీ, తిన్న తిట్లూ, పడ్డశ్రమా, ఓర్చిన ఓర్పూ, అన్నీ ఒక్కమాటతో తుడిచేసేరు! మీకు నామీద యిట్టి అభిప్రాయం ఉన్నదని నేను ఎన్నడూ అనుకోలేదు! మీకు మనస్సులో ఇంత కపటము కల్మషము ఉన్నదని నాకు తెలియలేదు!

"నలువశిరంబు ముట్టినను నల్లనివానిని నమ్మవచ్చునే" అన్నమాట యీనాడు సార్థకమైంది! ఆహా! ఆడవాళ్లు ఎంత వేగంగా నమ్మివేస్తారు! ఎంత వేగముగా వలలో పడిపోతారు! పూర్వంనుండీ ఇలాగు దగాచేసుకొనే వచ్చారు ఆడవాళ్లని మగవాళ్లు! ఆడినన్ని మాటలూ ఆడీడం. పెట్టినన్ని చీవాట్లు పెట్టీటం, ఆఖరుకి ఏముఖం తుడుపుమాట అనడమో, లేక ఏతూలు రవికెలగుడ్డ కొనడమో చేసేసరికి అమాయకపు ఆడది అదంతా నిజమైన అభిమానమే అనుకొని తిట్లు చీవాట్లు అన్నీ మరచిపోతుంది! నూరు చెప్పుదెబ్బలైనా ఒక్కబూరె ముక్కతో సాటి కావని అనుకొంటుంది! ఇలాగు నిత్యమూ మగవాళ్లు కొంపలు తీస్తునే ఉంటారు!

కల్లలు వాళ్లవే, కపటములు వాళ్లవే; దొంగతనం వారిదే; అబద్ధాలు వారివే, అన్యాయాలు వారివే; కాఠిన్యం వారిదే, క్రౌర్యం వారిదే; మోసం వారిదే, మూర్ఖం వారిదే; ఇలాగు అవలక్షణము లన్నీ పెట్టుకొని ఆడవాళ్లని మాయచేత లొంగతీయబట్టే పూర్వము "మాయా శీలురు, చంచలాత్ము లనుకంపాశూన్యు లాత్మైకకా। ర్యాయత్తుల్ సమయాను కూల హృదయవ్యాపార గోపాయనో। పాయజ్ఞుల్ మగవారలు" అని అన్నారు.

ఇన్ని బాధలు కష్టములు ఓర్మితో పడుతూ ఉన్న నన్నే మీరు యింత చులకనగా అనేసేరు గదా, యింక లోకంలో ఎక్కడ న్యాయం ఉంది చెప్పండి! తక్కిన అంద రాడవాళ్లలాగు బట్టలు కొని యిమ్మని బలవంతం చేయలేదు! సరుకులు పెట్టమని చంపుకొని తినలేదు! పిల్లలతో విసికిపోలేదు! మీ అమ్మనీ అప్పనీ యెదిరించలేదు! మా పుట్టింటికి తరుచు పారిపోలేదు! మిమ్మలిని కాఫీక్లబ్బు గాని క్లబ్బు గాని ఆటపాటలు గాని ఖర్చు వెచ్చాలు గాని మానవలసినదని బలాత్కరించలేదు! 'పందంటే పంది, నందంటే నంది' అని మీరు చెప్పినదానికీ చేసినదానికీ అన్నిటికీ అలాగే అని తల ఊచిపడిఉంటే ఇదా నాకు మీరు అఖరికి యిచ్చిన కితాబు! మార్జాలమునా నేను? నిజమే! మీరు పిల్లి అయినప్పుడు మీ పెళ్లామును అయిన నేను పిల్లిని గాక మరేమవుతాను? మీకు పిల్లి గుణములు గాక పులి గుణములు ఒకటైనా ఉందీ? ఇంట్లో ఆడవాళ్లు కేకవేసుకుంటూ ఉంటే తోకముడుచుకొని పారిపోతారు గాని వాళ్లని ఆపలేరు గదా! ఎలకలవంటి అనాథుబంట్రోతు గుంటలమీదికి పిడుగు అయిపోతారు గాని ఆడదైనా డాబుచేసి కేకలేస్తే దాడులీయడమే కదూ మీ శక్తి? మేష్టరుని మీరు ఆక్షేపిస్తారు గాని నిజంగా మేష్టర్లయందు పిల్లలికి భయమూ భక్తీకూడా ఉండవచ్చును. ఈ వూరి హెడ్డుమేష్టరుని చూడండీ! అతడంటే అందరికీ యెంత గౌరవమో! మీయందో? ఎవడికీ యేమీ ఉండదు, హేళన తృణీకారము తప్ప! మీరు పిల్లి కాబట్టీ మీ పెళ్లామును నేనుకూడా జింహ్వా చచ్చిన పిల్లిలాగు ఉండబట్టే మనకి యీ యింట్లో యింత నీచకముగా చూడడమూ అవగ్యాదా చేయడమూ జరుగుచున్నాయి! అసలు ప్లీడరంటేనే పిల్లి! దానిలో మీరు మరీ చేతకాని పిల్లి! అటువంటి పిల్లికి పెళ్లాము—మరీ నీచపుపిల్లి—మన దాంపత్యము మార్జాలదాంపత్యము కాక మరేమిటి అవుతుంది?

'ప్లీడరంటే పిల్లివంటివాడా? వాడికి యెంత స్వేచ్ఛ, యెంత గౌరవము?'

"చెప్పేదేమిటి ప్లీడర్ల స్వేచ్ఛాగౌరవ మున్నా?......లంచాలు కుదర్చడము కూడా చేయడానికి జంకని మీ ప్లీడర్లకు గౌరవము స్వేచ్ఛ చెప్పేదేమిటి?

ఎవరు కుదురుస్తున్నారా? ఏం సంగ నాచులండీ! ఎరగనట్లు నటిస్తారు? మన ఊళ్లో ఒక పెద్దప్లీడరు సానివాడేనా? మరొక పెద్దప్లీడరు చిన్నవాడుగా ఉన్నప్పుడు చేసిన పని యిదేనట! దానివల్లే ముందరికి వచ్చేడుట! ఇప్పుడిప్పుడు మీా గుంట ప్లీడర్లుకూడా కొందరు ఇట్టివి మొదలుపెట్టేరుట! యిప్పుడు డబ్బు సువాసనలో ఆ నీచపుకంపు కనపడదో, లేకపోతే కక్కోజీబాధలాగు ఆ కాస్తసేపూ ఆ బాధపడక తీరదనోవారిని అందరూ గౌరవిస్తారు! అట్టి గౌరవాలకి లెక్కేమిటి? ఇకను అధికార్లకి పళ్లూ ఫలాలూ పంపించే వాళ్లు, వాళ్ల యింట కాస్త కష్టంవస్తే తమ యింట్లో శవం పోయినట్లు యేడ్చేవాళ్లు, యిళ్లకు వెళ్లి ఆశ్రయించేవాళ్లు, మానాన్న వప్పచెప్పేవాళ్లు, వాళ్ల సంగతి చెప్ప నక్కర్లేదు గదా! గంతలో పడేసిన యెంగిలాకుల మీాద కుక్కలకు స్వేచ్ఛలేదూ? అట్టిదే మీా ప్లీడరీ స్వేచ్ఛ! అంచేత మీారు ప్లీడరు పిల్లి; నేను మీా పెళ్లాం పిల్లిని; మనది మార్జాల దాంపత్యము కాక సీతారాముల దాంపత్య మెట్లవుతుంది?

ఆహా! అంత చులకనగా అనేసేరు గాని నేను ఆ వెల్నాటి ఓవర్సీరు పెళ్లాంలాగు, నీళ్లుతోడి తెమ్మన్నానా? పొయ్యిలోనికి కర్రలు కొట్టమన్నానా? కుంపటిలో నిప్పు చెయ్యమన్నానా? వంటంతస్తే[illegible] పిల్లలని ఆడించమన్నానా? మీా యం[illegible] మిమ్మలినే వడ్డించుకోమన్నానా? పిల్లలిని యెత్తుకుంటూవా, యెంగిళ్లెత్తుకుంటూవా అని అడిగి ఆఖరికి రెండూ చేయించేనా? చేతిలో రూపాయి అయినా లేకుండా లాగేసి మంగలి ఖర్చులకికూడా పెళ్లామును అడగవలసిన యోగ్యత పట్టించేనా? పడకగది ఉపన్యాసమందిరముగాను తక్కినవి కవాతు మెరకలుగాను చేసివేసేనా? వేసవికాలములో విసనికర్ర అతని చేతిలో అంటుకుపోయినట్లు ఉండిపోవడమే గదూ! పిల్లలకు విసరడమని మిష—అమ్మగారికే సేవ! ఇటువంటి పనులు ఒకటీ లేదు గదా, ఒకటీ మీాచేత చేయించలేదు గదా, ఎందు కలాగు అనేసేరు? మీాకు యేమైనా విశ్వాసమూ ప్రేమా న్యాయమూ ఉన్నాయీా? ఉంటే ఎందు కలాగు అంటారు?

హాస్యానికి అన్నారా? ఇదా హాస్యము? ఈ మోస్తరుగానే గదూ మీా మగవాళ్లు పూర్వంనుండీ చేస్తూఉన్న దగాచర్యలు! అన్నంతమాటా అనీడం—హాస్యమునకని వెనుకనుండి సర్దుబాటు చేయడం—ఏమి సబబుగానున్నది? హాస్యమంటే యెంత నాజూకుగా ఉండాలి! ఎంత సంతోషము పుట్టాలి! వేసవికాలములో ఐసుక్రీము తింటే చల్లదనము ఒంటికి వ్యాపించినట్లు హాస్యమువలన ఆనందం పుట్టి వ్యాపించాలి! అంతేగాని కర్రవిరిచి పొయ్యిలో బెట్టినట్లు ఏదో ఒక పోటుకుమాటు పొడుచుకొని చచ్చేటట్లు అనీడమూ, ఆతరువాత గిజగిజగించుకొని కొట్టుకుంటూ ఉంటే హాస్యానికన్నానని తేలిపోవడమున్నా? ఈమాటు యిటువంటి హాస్యాలు కట్టిపెట్టండి! లేదా, లేకపోతే ఆరాత్రి నిద్రకు సెలవుపెట్టండి.